క్లుప్తంగా

ప్రభుత్వ గుత్తేదారుల సమస్యలు పరిష్కరించాలి

రాజమహేంద్రవరం: ప్రభుత్వ గుత్తేదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సబ్కా తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కీర్తి చేకూరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌లో చాలాకాలంగా పెండింగ్‌లో బిల్లులను ట్రిడ్స్ విధానంలో చెల్లించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2025 మే 5వ తేదీన విడుదల చేసిన జీఓ ఎంఎస్ నంబర్ 71ను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ద్వారా బిల్లులు ఎప్పటికప్పుడు సక్రమంగా చెల్లించేలా చర్యలు తీసుకుని, గుత్తేదారులను ఆదుకోవాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి వెంటనే తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి అధ్యక్షులు మద్దాల ధర్మాజీ రావు, సబ్కా స్టేట్ జాయింట్ సెక్రెటరీ ముత్యాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల ధర్నా

సీటీఆర్ఐ: ఏఐబీఈఏ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ప్రైవేటు బ్యాంకు ఉద్యోగుల సమస్యలకు మద్దతుగా మంగళవారం కరూర్ వైశ్య బ్యాంకు వద్ద తూర్పు గోదావరి జిల్లా బ్యాంకు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా బీఈఏసీ కార్యదర్శి లక్ష్మీపతి రావు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సోమరాజు, మురళీధర్, స్వాతి, రమేష్, అప్పారావు, కిషోర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారం తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించండి

కంబాలచెరువు: అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం నిర్దేశించిన తేదీల్లో తల్లిదండ్రుల సమావేశాలు విధిగా నిర్వహించాలని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో డీఐ పాల్గొన్నారు. పాఠశాలలకు ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలపై చర్చించారు. ఎస్ఎంసీ చైర్మన్ నయీముద్దీన్ మాట్లాడుతూ ఉర్దూ పండిట్‌లను నియమించాలని, పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్ గ్రేడ్ చేయాలన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయిని స్వర్ణ మైథిలి, సీఆర్ఎమ్‌టీ జే.శ్రీనివాసరావు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు

ముగిసిన బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలు

ప్రకాశం నగర్: స్థానిక ఎస్‌కేవీటీ పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల అండర్-14, 17 బాలురు, బాలికాల బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలు మంగళవారం సాయంత్రంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి కాకినాడ జోన్-2 ఆర్ఐపీఈ జాన్సన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం విజేలకు పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, చైర్మన్ రాజశేఖర్, కార్యదర్శి వీరబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే అంతర్ జిల్లాల అండర్- 19 బాలురు, బాలికాల బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలు ఎస్‌కేవీటీ పాఠశాల క్రీడా మైదానం ప్రారంభమయ్యాయి. అండర్-19 ఉషూ బాలురు, బాలికాల విభాగంలో పోటీలు స్థానిక తుమ్మలావలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో ప్రారంభమయ్యాయని ఫెడరేషన్ కార్యదర్శులు ఏవీడీ ప్రసాదరావు, భువనేశ్వరి తెలిపారు.

అప్పారావు మరణం తీరనిలోటు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జర్నలిజంలో నైతిక విలువలు పాటిస్తూ, ఎందరినో జర్నలిస్టులుగా ప్రోత్సహించిన సీనియర్ పాత్రికేయులు స్వర్గీయ అడపా అప్పారావు మరణం జర్నలిజానికి తీరని లోటని పలువురు సీనియర్ పాత్రికేయులు కొనియాడారు. స్వర్గీయ అడపా అప్పారావు సంతాప సభ ది రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఘనంగా జరిగింది. సభలో అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అప్పారావుతో తమకున్న అనుబంధాన్ని మిత్రులు గుర్తు చేసుకున్నారు. ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు ఎం.శ్రీరామ్మూర్తి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి ఆధ్వర్యంలో సభ జరిగింది. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, సీనియర్ పాత్రికేయులు వి.నవీన్, జి.భూషణ్‌బాబు, వీఎస్ఎస్ కృష్ణ కుమార్, శైలేంద్ర, సన్నిధానం శాస్త్రి, ఎం.శ్రీనివాసరెడ్డి, ఎన్ఎస్ఎన్ సత్యనారాయణ, దేవులపల్లి రామలింగం, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాలతో కూటమి కోటలకు బీటలు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు
- రాజవోలు గ్రామంలో రచ్చబండ కార్యక్రమం

రాజమహేంద్రవరం రూరల్: కోటి సంతకాలతో కూటమి కోటలకు బీటలు వారడం ఖాయమని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెల్లుబికుతున్న ప్రజాగ్రహ జ్వాలల్లో దగ్ధమవడం తథ్యమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ స్పష్టం చేశారు. మంగళవారం రాజవోలు గ్రామంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమంలో భాగంగా మాజీ వైస్ ఎంపీపీ, పార్టీ సీనియర్ నేత నక్కా రాజబాబు ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ వైఎస్ జగన్ హయాంలో కొత్తగా 17 మెడికల్ కాలేజీలను రాష్ట్రానికి తీసుకుని వస్తే, వాటిని చంద్రబాబు అప్పనంగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫలితంగా ఇటు పేద విద్యార్థుల వైద్య విద్యకు, అటు పేద ప్రజలు వైద్యానికి దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ అనర్థం జరగకుండా ఉండేందుకే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యాచరణ రూపొందించి పోరుబాట పట్టారని, సంతకాల కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందన్నారు. యువగళం పాదయాత్రలో లోకేష్ మెడికల్ కళాశాలలను, ఆసుపత్రిలను అభివృద్ధి చేస్తానని చెప్పి ఇప్పుడు ప్రైవేటు పరం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులైపారుతుందని, కూటమి ప్రభుత్వం ప్రజలు ప్రాణాలతో అటలాడుకుంటుందన్నారు. రాజవోలు గ్రామంలో బెల్టుషాపులో 98 రూపాయల నిబ్బు రూ.130కి విక్రయిస్తున్నారన్నారు. చట్టపరిధిలో లేని బెల్టుషాపుల ద్వారా కూటమి ప్రభుత్వం అక్రమార్జనకు పాల్పడుతున్నారన్నారు. అనధికార బెల్టుషాపులను నిర్మూలించేందుకు, నకిలీ మద్యంపై వైఎస్సార్ సీపీ పోరాడుతుందని చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ రాజమండ్రి పార్లమెంటు ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నకిలీ మద్యం దందా నిర్వహిస్తోందన్నారు. పేద ప్రజలకు మెడికల్ విద్య, వైద్యసేవలు అందించేందుకు మెడికల్ కళాశాలలను తీసుకువస్తే కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు విద్య,వైద్యంను దూరం చేసేందుకు పీపీపీ విధానంను తీసుకువచ్చి కుట్ర చేస్తుందన్నారు. దీన్ని ప్రజలంతా తిప్పి కొట్టాలన్నారు. మాజీ వైఎస్ ఎంపీపీ నక్కా రాజబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ మద్యంను కూటమి ప్రభుత్వం కుటీర పరిశ్రమలు ద్వారా ఏరులైపారిస్తుందన్నారు. నకిలీ మద్యం వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలను వంచించదన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలందరికీ వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మహిళావిభాగ ప్రధాన కార్యదర్శి అంగాడి సత్యప్రియ, రాష్ట్ర వాణిజ్య విభాగ ప్రధానకార్యదర్శి పడాల వీరరాఘవరెడ్డి, జిల్లా అధికారప్రతినిధి పెయ్యల రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల చక్రవర్తి, దాసరిశివ, జిల్లా ఉపాధ్యక్షుడు బొప్పన సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ నక్కా శ్యాంబాబు, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, వివిధ విభాగాల చైర్మన్ల ఆచంట కల్యాణ్, చింతపర్తి రాంబాబు, రాజవోలు గ్రామ పార్టీ నేతలు పేటరామకృష్ణ, మట్టా వీర్రాజు, కె.కన్నబాబు, జుత్తిక గంగరాజు, ముంగమూరి అజయ్, చోడదాసి రమణ, హరీష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో చెల్లుబోయిన వేణు, గూడూరి శ్రీనివాస్, నక్కా రాజబాబు తదితరులు

ప్రపంచానికి భారత విజ్ఞానమే మూలం

- ఎస్‌కేవీటీలో ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సు
- ప్రాచీన శాస్త్రాలపై పలువురి ప్రసంగం
- హాజరైన జింబాబ్వే, జాంబియా, సౌత్ ఆఫ్రికా విద్యార్థులు


సావనీర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపాణ్యం తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ప్రపంచానికి భారతదేశం అనేక విజ్ఞానాలను అందించిందని, నేడు ప్రపంచమంతా మన శాస్త్రాలను ఒప్పుకుంటున్నారని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపాణ్యం అన్నారు. 'ప్రాచీన భారత జ్ఞాన పునర్జీవనం- ప్రపంచ సమస్యల పరిష్కారానికి ఒక నిధి' అనే అంశంపై రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ కళాశాలలో రెండు రోజులపాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. మంగళవారం ప్రారంభమైన ఈ సదస్సులో ముందుగా కందుకూరి వీరేశలింగం, రాజ్యలక్ష్మి విగ్రహాలకి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి ఈ అంతర్జాతీయ సదస్సుని ప్రారంభించారు. ఈ సదస్సులో మొదటి రోజు జింబాబ్వే, జాంబియా, సౌత్ ఆఫ్రికా విద్యార్థులు పాల్గొని భారతదేశ జ్ఞాన సందప గురించి ప్రముఖుల ప్రసంగాలను శ్రద్ధగా వినడమే కాకుండా ముఖ్యంశాలను రాసుకున్నారు.

సదస్సు ముఖ్య ఉద్దేశ్యం

ప్రాచీన కళలకు భారతదేశం పుట్టినిల్లు. ఈ పవిత్ర భారతదేశంలో ఎన్నో గ్రంథాలు, వేదాలు, శాస్త్రాలు రచించారు. నాట్యం, సంగీతం, చిత్రలేఖనం, జోతిష్య శాస్త్రం, ఖగోళశాస్త్రం, విజ్ఞాన శాస్త్రం, యోగా, ధ్యానం, ఆయుర్వేదం, వ్యవసాయం, తత్వశాస్త్రం, సాహిత్యం, కళలు వంటి ఎన్నో అద్భుత గ్రంథాలు వేల సంవత్సరాల పూర్వమే మనకి అందించారు. కాని వాటిని వదిలి పాశ్చాత్య పైత్యం వైపు నేటి యువత పరుగులు తీస్తోంది. దీంతో ఒత్తిడితో అనేక శారీరక రుగ్మతలు ఏర్పడి చిన్న వయస్సులోనే తనువు చాలిస్తున్నారు. వీటన్నింటికి మూలం మన పూర్వీకులు చెప్పిన సూత్రాలను నేటి యువత పట్టించుకోకపోవడం. నేటి ప్రపంచంలో మార్పుల కారణంగా మళ్లీ మన దృష్టి ప్రాచీన భారతీయ జ్ఞాన వ్యవస్థల వైపు తిరగడం అనివార్యమైంది. వేల సంవత్సరాల క్రితం అభివృద్ధి చెందిన ఈ జ్ఞానం కేవలం చారిత్రక ఆసక్తికి మాత్రమే పరిమితం కాకుండా, సమకాలీన ప్రపంచ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను అందిస్తోంది. ఈ కార్యక్రమంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విభిన్న రంగ ప్రతిభావంతులు పాల్గొనుంటున్నారు. మన పురాతన భారతీయ జ్ఞాన సంపద శక్తిని తెలియజేయడానికే ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు.

పూర్వీకుల విజయాలు

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బీవీ తిరుపాణ్యం మాట్లాడుతూ మన పురాతన భారతీయ జ్ఞాన సంపద అనేది కేవలం వైభవం మాత్రమే కాదని, నేటి ప్రపంచ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాల అందించగల శక్తివంతమైన సాధనమని తెలిపారు. కీలక ఉపన్యాసం చేసిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్కియాలజీ విశ్రాంత ఆచార్యులు డి.భాస్కరమూర్తి మాట్లాడుతూ వేదం ఉపనిషత్ యోగం, వాస్తు, వ్యవసాయం, గణితం, ఖగోళ శాస్త్రాలన్నీ మన పూర్వీకులు సాధించిన అసాధారణ విజయాలనీ, వాటిని ఈ రోజు కూడా అత్యంత కచ్చితత్వాన్ని నిరూపిస్తున్నాయని తెలిపారు. ప్రారంభ ఉపన్యాసం చేసిన కాలేజీ ఎట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి కృష్ణ మాట్లాడుతూ భారతీయ విజ్ఞానం ఆధునిక శాస్త్ర విజ్ఞానంతో మానవజాతికి ఓ చక్కని భవిష్యత్తుని అందివ్వ గలుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, డాక్టర్ చీమలమర్రి శ్రీనివాస్ శర్మ, ఆచార్య డి.కిరణ్ కాంత్ చౌదరి, ఆచార్య పసుమర్తి శ్రీనివాస్ శర్మ, ఆచార్య సి.స్వరూప రాణి, తదితరులు పరిశోధనాత్మక పత్రాలను చదివి వినిపించారు. ఈ సదస్సులో 225 మంది తమ గోష్టి పత్రాలను పంపించినట్టు కో కన్వీనర్ డాక్టర్ వై.స్వర్ణ శ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పీవీబీ సంజీవరావు, ఎల్ఐసీ సీనియర్ డివిజన్ మేనేజర్ సత్యనారాయణ సాహూ, ఎ.శాంతరాజ్యం, డాక్టర్ డివి రమణమూర్తి, జి.శరత్ బాబు పాల్గొన్నారు.


హాజరైన విదేశీ విద్యార్థులు

జీఎస్టీ 2.0తో నిర్మాణ రంగానికి ఊతం

- అదనపు కమిషనర్ రామలింగేశ్వర్


సమావేశంలో పాల్గొన్న అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ తదితరులు

సీటీఆర్ఐ: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ 2.0తో నిర్మాణ రంగానికి ఊతం లభించిందని అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ అన్నారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్‌లో మంగళవారం నిర్మాణ రంగంలోని వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సామాన్యుల సొంతింటి కల సాకారానికి జీఎస్టీ సంస్కరణలు ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా అదనపు కమిషనర్ పేర్కొన్నారు. సిమెంట్‌పై గతంలో 28 శాతం ఉన్న జీఎస్టీని 18 శాతానికి, ఇటుక, టైల్స్‌పై ఉన్న 12 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించారన్నారు. వీటితో పాటు నిర్మాణ రంగంలో కీలకమైన ఇసుక, గ్రానైట్, మార్బుల్, రంగులు వంటి వాటిపై జీఎస్టీ తగ్గిందన్నారు. సాధారణంగా ఇంటి నిర్మాణంలో అయ్యే ఖర్చులో 40 నుంచి 45 శాతం వ్యయం నిర్మాణ సామగ్రిదే ఉంటుందని, తాజా జీఎస్టీ సవరణతో నిర్మాణ సామగ్రిలో అయ్యే ఖర్చులో 10 నుంచి 15 శాతం ఆదా అవుతుందన్నారు. అనంతరం భవన నిర్మాణదారుల అభిప్రాయాలను సేకరించారు. సెక్రటరీ జి.శైలజవల్లి, డిప్యూటీఅసిస్టెంట్ కమిషనర్ ఎస్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకుంటానంటూ క్రీడాకారుడి హంగామా

ప్రకాశం నగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో ఆత్మహత్య చేసుకుంటానంటూ ఒక క్రీడాకారుడు హంగామా సృష్టించాడు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ క్రీడా మైదానంలో నాలుగో రోజు మంగళవారం అండర్- 14, 17 బాలురు, బాలికాల విభాగంలో పోటీలు జరిగాయి. అండర్ -17 బాలురు విభాగంలో విశాఖ జిల్లాకు చెందిన ఒక క్రీడాకారుడు రింగ్‌లో తన ప్రత్యర్థి చేతిలో ఓటమి పాలై, తను ఓటమి చెందలేదని న్యాయ నిర్ణేతలు తనకు అన్యాయం చేశారని ఆరోపిస్తూ పక్కనే ఉన్న స్కూల్ బిల్డింగ్ పైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దీంతో ఒక్కసారిగా క్రీడా మైదానంలో కలకలం రేగింది. క్రీడాకారుడికి తోటి సహచరులు, రిఫరీలు నచ్చచెప్పడంతో ఎట్టకేలకు బిల్డింగ్ పై నుంచి దిగివచ్చాడు.

బహిరంగ ప్రకటన

[illegible]

యస్. వాజాజ్, M.Sc., LLB; అడ్వకేట్,
డోర్ నెం.49-48-19, NGGO's కాలనీ,
విశాఖపట్నం అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16
తేది : 14.10.2025 ఫోన్ : 80740 46010

మద్యం దుకాణాల్లో తనిఖీలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఏపీ ఎక్సైజ్ సురక్షయాప్ ద్వారా మద్యం కొనుగోలు చేసేవారు బాటిల్ మూతపై ఉన్న హీల్‌ను స్కాన్ చేసి, నిజమైందా, నకిలీదా అని తెలుసుకోవచ్చని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి చింతాడ లావణ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నకిలీదని అనిపించిన పక్షంలో వెంటనే టోల్ ఫ్రీనంబర్ 14405కి సమాచారం అందించాలని ఆమె కోరారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నిరంతర పర్యవేక్షణలో జిల్లాలోని 138 మద్యం దుకాణాలు, 20 బార్లలో నాణ్యత తనిఖీ చేశామన్నారు.

బాలికలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- స్త్రీ, సంక్షేమ శాఖ పీడీ శ్రీదేవి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా స్త్రీ, సంక్షేమ శాఖ పీడీ శ్రీదేవి తదితరులు

సీటీఆర్ఐ: బాలికలు అన్ని రంగాల్లోనూ సమాన అవకాశాలు పొందుతూ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని జిల్లా స్త్రీ, సంక్షేమ శాఖ పీడీ టీ శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో మంగళవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ విద్య అనే ఆయుధంతో ప్రతి బాలిక ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. జిల్లా విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు మాట్లాడుతూ బాలికలు విద్యలో రాణించడమే కాకుండా ఆత్మవిశ్వాసంతో ప్రతి రంగంలో ముందుకు సాగాలన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కె.ఎన్.జ్యోతి మాట్లాడుతూ బాలికలు భద్రత, రక్షణ, ఆరోగ్యం, పౌష్టికాహారం మీద అవగాహన పెంపొందించు కోవాలన్నారు. సైబర్ క్రైమ్ సెల్ అధికారి వై.ఎస్.వి.సురేష్ బాబు మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని, సోషల్ మీడియాలో నిర్లక్ష్యం వల్ల సైబర్ క్రైమ్ ఘటనలు పెరుగుతున్నాయని హెచ్చరించారు. సమాజంలో ధైర్యంగా ఉండాలన్నారు. బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బి. శశాంక, డీఐఓ డాక్టర్ పి.కోమల, డీపీఎంఓ కె.శ్రీవల్లి, బాలికల చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డి.ఎస్తేరు రాణి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ముత్యాల సుబ్బారావు, సీడీపీవోలు, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

లివర్ వ్యాధులపై అవగాహన అవసరం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): లివర్ సంబంధిత వ్యాధులపై అవగాహన అవసరమని హైదరాబాద్ యశోధ ఆసుపత్రి గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సోమశేఖర్ పేర్కొన్నారు. శ్రీ పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్, బీసీఓఎన్-సీసీసీ ఛానల్స్ సంయుక్తంగా గ్యాస్ట్రిక్, లివర్ వ్యాధులపై మంగళవారం కేబుల్ ఆపరేటర్లు, జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన హైదరాబాద్ హైటెక్ సిటీ యశోధ ఆసుపత్రి ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, సేవ్ లివర్ ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ సోమశేఖర్ మాట్లాడుతూ లివర్ పాడవ్వడానికి ఆల్కహాల్‌తోపాటు హెపటైటిస్ బీ, సీ వైరస్‌లు కారణమన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. హెపటైటిస్ బి,సి కారణంగా లివర్ పాడవ్వడం జాతీయ యావరేజ్ 3 నుంచి 4 శాతం ఉండగా, ఉభయ గోదావరి జిల్లాల్లో హెపటైటిస్ బీ, సీ కారణంగా లివర్ పాడవ్వడం 9 శాతంగా ఉందన్నారు. దీనిని ముందుగానే గుర్తిస్తే చికిత్స ద్వారా పూర్తిగా నయం చేయవచ్చన్నారు. ఏడాదిలో ఒక్కసారి అయినా ప్రతి ఒక్కరూ లివర్ ఫంక్షన్ టెస్ట్ చేయించుకోవాలన్నారు. ముఖ్య అతిథిలుగా హాజరైన వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యులు, మాజీ డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మాట్లాడుతూ పంతం ట్రస్ట్ ద్వారా పంతం కొండలరావు చేస్తున్న సామాజిక సేవలను అభినందించారు. జనసేన సిటీ ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ, నగర అధ్యక్షుడు వై.శ్రీను, ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ యెనుముల రంగబాబు తదితరులు మాట్లాడారు.

పంచాయతీ కార్మికుడు ప్రసాద్ కుటుంబాన్ని ఆదుకోవాలి

- మృతదేహంతో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బంధువుల ఆందోళన

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట గ్రామ పంచాయతీ కాంట్రాక్ట్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న పసలపూడి ప్రసాద్(55) అధికారుల నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు, కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం హుకుంపేట పంచాయతీ కార్యాలయం వద్ద ప్రసాద్ మృతదేహంతో ఆందోళన చేశారు. మృతుని కుటుంబ సభ్యుడు పసలపూడి దివాకర్ మాట్లాడుతూ హుకుంపేట గ్రామ పంచాయతీలో ట్రాక్టరు డ్రైవరుగా పని చేస్తున్న పసలపూడి ప్రసాద్ సోమవారం విధి నిర్వహణలో ఉండగా గుండె పోటుతో ట్రాక్టర్ స్టీరింగ్‌పై పడి అస్వస్థతకు గురయ్యాడని, అతనిని హుకుంపేట పంచాయతీ సిబ్బంది సకాలంలో ఆసుపత్రికి తీసుకు వెళ్లలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అతనిని ఇంటి వద్ద దిగబెట్టి చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు. సకాలంలో వైద్యం అందక పోవడంతో మంగళవారం ప్రసాద్ మృతి చెందాడని పేర్కొన్నారు. మృతుడికి తల్లి, చెల్లితో పాటు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. అధికారులు నిర్లక్ష్యం వల్ల ఆ కుటుంబం రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన స్థలంలో పంచాయతీ సూపర్‌వైజర్ ఉన్నప్పటికీ హాస్పిటల్‌కి తరలించలేదని ఆరోపించారు. మృతుడు కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ప్రభుత్వం నుంచి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘటన స్థలంలో బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్, గ్రామపెద్దలు, పంచాయతీ కార్యదర్శి కాశీవిశ్వనాథ్ ఆందోళన కారులతో మాట్లాడారు. మృతుని పసలపూడి ప్రసాద్ కుటుంబానికి ఎంపీడీవో, డీపీవో, ఉన్నతాధికారులకు, రూరల్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వెళ్లి న్యాయం చేస్తానని పంచాయతీ కార్యదర్శి కాశీవిశ్వనాథ్ హామీ ఇవ్వడంతో రాత్రి ఏడు గంటలకు ఆందోళన విరమించారు. . కార్యక్రమంలో పసలపూడి శ్రీనివాస్, మారంపూడి వెంకన్న, పంచాయతీ కార్మికురాలు ధనలక్ష్మి పంచాయతీ కార్మికులు కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


హుకుంపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రసాద్ మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

శ్రద్ధాంజలి



మాకు అత్యంత ఆప్తులు
శ్రీ అడ్డగర్ల జగన్‌బాబు గారి తండ్రి గారు
స్వర్గీయ శ్రీ అడ్డగర్ల కామేశ్వరరావు గారి
మరణానికి చింతిస్తూ... వారి పవిత్ర ఆత్మకు శాంతి
చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
వారి కుటుంబసభ్యులకు
మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ...

స్వర్గీయ శ్రీ అడ్డగర్ల కామేశ్వరరావు గారు
జననం : 01-07-1941 మరణం : 05-10-2025

పెద్దకార్యం : ది. 15-10-2025 అనగా బుధవారం ఉదయం షెల్టన్ హోటల్, రాజమండ్రి నందు జరుగును

శ్రీ కురసాల కన్నబాబు – మాజీ మంత్రివర్యులు
శ్రీ జక్కంపూడి రాజా – మాజీ శాసనసభ్యులు
శ్రీ తుమ్మల రామస్వామి (బాబు) – డిసిసిబి చైర్మన్, కుడా చైర్మన్, కాకినాడ

యాళ్ల దొరబాబు చైర్మన్: పశుగణాభివృద్ధి సంస్థ	అత్తి సత్యనారాయణ అనుశ్రీ ఫిలింస్	యాళ్ల సురేష్ లక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ రాజమండ్రి
కర్రి సత్యనారాయణరెడ్డి రాజమండ్రి	బోణం సతీష్ జి.ఐ.ఇ.టి.ఇంజనీరింగ్ కాలేజ్	ముత్యాల సతీష్ & ఫ్రెండ్స్ కాకినాడ
S.వెంకటరమేష్ S.V.R.ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్ రాజమండ్రి	ఉప్పలూరి బ్రహ్మాజీ రాజా థియేటర్ రాజమండ్రి	C.N.కుమార్ (బిల్డర్) వైజాగ్ గోపాలం శ్రీను విజయవాడ
దుద్దుపూడి శ్రీధర్ S.V.S.ఫైనాన్స్ రాజమండ్రి	సుంకర గౌతమ్‌కుమార్ గిరిధారి ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్	P.S.చంద్రమౌళి విష్ణు సాయి ఫైనాన్స్ రాజమండ్రి
గద్దె వెంకటకృష్ణచౌదరి రాజమండ్రి	పులవర్తి లక్ష్మణస్వామి స్వామి థియేటర్ రాజమండ్రి	మల్లిపూడి రామ్‌జీ హైదరాబాద్
సత్యశ్రీ డెవలపర్స్ LLP భువన విల్లాస్ దివాన్‌చెరువు, రాజమండ్రి	కొండేటి భీమారావు మాజీ కార్పొరేటర్ రాజమండ్రి. సెల్ : 99089 90880	వాకాడ తిరుమలరావు శ్రీ సాయి తిరుమల కన్‌స్ట్రక్షన్స్ హైదరాబాద్
చాపర్ల ప్రసాద్ (లండన్ ప్రసాద్) రాజమండ్రి	T.V.రామకృష్ణ (బాబి) శ్రీజ డెవలపర్స్ రాజమండ్రి	G.P.నాయుడు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ కొత్తపేట
బోయిడి రాజేష్‌నాయుడు ఆకుల రవికిరణ్	ధనరాజ్ SDR వెంచర్స్, గాడాల	ధరణాల దొరబాబు